క్లుప్తంగా

అక్రమ అరెస్ట్‌లను ఖండిస్తున్నాం

ఏఐపీఎస్‌యూ జిల్లా కమిటీ



మాట్లాడుతున్న ఏఐపీఎస్‌యూ జిల్లా ఇన్‌చార్జి అప్పాల కృష్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నీట్ పరీక్షలను రద్దు చేయాలని కోరుతూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇంటి ముట్టడికి ప్రయత్నించిన విద్యార్థి సంఘాల నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదని ఆలిండియా ప్రోగ్రెస్ స్టూడెంట్ యూనియన్ (ఏఐపీఎస్‌యూ) జిల్లా ఇన్‌చార్జి అప్పాల కృష్ణ అన్నారు. శనివారం జిల్లా ఏఐపీఎస్‌యూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు పాల్పడిన వారిని శిక్షించాలన్నారు. నీట్ ఫలితాలను తక్షణమే రద్దు చేయాలని, 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కార్యక్రమంలో ఏఐపీఎస్‌యూ జిల్లా నాయకులు రవి, శేఖర్, నవీన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పాలీసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

నంగునూరు(సిద్దిపేట): పాలిటెక్నిక్ కళాశాలల ప్రవేశం కోసం నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ శనివారం ప్రారంభమైంది. రాజగోపాల్‌పేట పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలనకు తొలిరోజు 280 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరిశీలన అనంతరం విద్యార్థులకు లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ శనివారం నుంచి ఈనెల 25 వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. లాగిన్ ఐడీ పొందిన విద్యార్థులు కళాశాల కోసం ఈనెల 27 వరకు వెబ్‌ఆప్షన్లు పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు నితిన్‌పవార్, శ్రీనివాస్, రాజు, సంధ్యారాణి, రాజమౌళి, ఎస్.శ్రీనివాస్, కవిత, జ్యోతి, స్వామి, బాలమణి పాల్గొన్నారు.

చెక్కులు అందజేత

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధి మోతె గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బైండ్ల శ్రీకాంత్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడికి బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉండటంతో బీమా మంజూరైంది. శనివారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మృతుడి కుటుంబానికి సభ్యత్వ బీమా రూ.2 లక్షల చెక్కును అందజేశారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న అదే గ్రామానికి చెందిన గెగ్గె యాదగిరికి మంజూరైన రూ.40 వేల ఎల్‌ఓసీ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, నాయకులు బోరెం రాజేశ్వర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సమావేశాలకు హాజరు

తొగుట(దుబ్బాక): ముంబైలో నిర్వహించిన విశ్వహిందూ పరిషత్ అఖిల భారత సమావేశంలో పాల్గొన్నట్లు సామాజిక సమరసత ప్రాంత ప్రముఖ్ ధనుంజయ శనివారం ఫోన్‌లో తెలిపారు. నాలుగు రోజుల పాటు సమావేశాలు జరిగాయన్నారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించినట్లు చెప్పారు. దేశంలో మత మార్పిడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని, ఇతర మతాల్లోకి వెళ్లిన వారిని తిరిగి హిందూమతంలోకి తీసుకురావాలని తీర్మానం చేశామన్నారు. సమావేశాలకు రాష్ట్రం నుంచి 11 మంది హాజరైనట్లు తెలిపారు.

ఉచిత వైద్యం అందేలా ప్రభుత్వం కృషి

సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజ్ డైరెక్టర్ విమలా థామస్

కొండపాక(గజ్వేల్): పేదలకు ఉచిత వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తోందని సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజ్ డైరెక్టరు విమలా థామస్ అన్నారు. మండల పరిధి మర్పడ్గలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు మెరుగైన వైద్యం అందేలా చూడటం ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. మర్పడ్గ గ్రామాన్ని మెడికల్ కాలేజ్ విద్యార్థులు దత్తత తీసుకునేలా చూస్తూ అన్ని రకాల వైద్య సేవలు అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్ నాయక్, ఎంపీటీసీ ఆంజనేయులు, కొండపాక ఆసుపత్రి వైద్యులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వినతి పత్రం అందజేత

కొండపాక(గజ్వేల్): మండలంలోని మంగోల్, తిప్పారం, కోనాయిపల్లి, మాత్‌పల్లి, మేదినీపూర్ గ్రామాలకు బస్సు సర్వీసు పునుద్ధరించాలని శనివారం గజ్వేల్–ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ జయపాల్‌కు విద్యార్థుల తల్లిదండ్రులు వినతి పత్రం సమర్పించారు. పైన పేర్కొన్న గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉండటంతో గజ్వేల్ పట్టణంలోని కళాశాలకు విద్యార్థులు సమయానికి చేరే వారన్నారు. బస్సు సర్వీసులు నిలిచిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మేనేజర్ త్వరలో బస్సు సౌకర్యం కల్పిస్తామంటూ హామీనిచ్చారన్నారు.

ప్రహరీ లేదు.. పట్టించుకోరు

పాఠశాలలకు ప్రహరీ లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. దీంతో వానాకాలంలో విష పురుగులతో ప్రమాదం పొంచి ఉందని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు ప్రహరీ నిర్మించాలని కోరుతున్నారు.

- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- విష పురుగులతో పొంచి ఉన్న ప్రమాదం
- దృష్టిసారించని అధికారులు



జగదేవ్‌పూర్‌లో మోడల్ స్కూల్

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో 16 ఏళ్ల క్రితం మోడల్ స్కూల్‌ను ప్రారంభించారు. అయితే భవనానికి ప్రహరీ నిర్మించలేదు. కొన్నేళ్ల తర్వాత ముందు నిర్మించి వెనుక వదిలేశారు. అలాగే పక్కన ఉన్న హాస్టల్ భవనానికి కూడా ప్రహరీ నిర్మించలేదు. పాఠశాల, కళాశాలలో సుమారు 300 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. భవనం వెనుక పంట పొలాలు ఉండటంతో పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగాయి. వర్షాకాలంలో విష పురుగులు హాస్టల్ భవనం ఆవరణ, పాఠశాల ఆవరణలోకి వస్తున్నాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలకు రావాలన్నా, హాస్టల్‌లో ఉండాలన్నా జంకుతున్నారు. ప్రస్తుతం భవనం వెనుక దట్టంగా పిచ్చి మొక్కలు పెరిగాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు పలుమార్లు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారుల దృష్టికి తీసుకుపోయినా ఫలితం లేకుండా పోయింది.

పక్కనే పశువుల సంత

మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో 160 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. సుమారు 15 ఏళ్ల క్రితం ప్రహరీ లేకుండా భవనం నిర్మించారు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పక్కనే పశువుల సంత ఉండటం వల్ల ప్రతీ శనివారం విద్యార్థులు అవస్థలుపడుతున్నారు. మండల సభలో ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకపోయిన ఫలితం లేకుండా పాయింది. అధికారులు స్పందించి ప్రహరీ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని మండల ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.



భవనం వెనుక దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలు

అధికారుల దృష్టికి తీసుకెళ్తా

మోడల్ స్కూల్, కేజీబీవీకి ప్రహరీ సమస్య ఉన్నమాట వాస్తవమే. ప్రహరీ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మోడల్ స్కూల్‌లోకి విష పురుగుల వస్తున్నాయని మా దృష్టికి తెచ్చారు. ఇదే విషయాన్ని విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రహరీ నిర్మాణం కోసం కృషి చేస్తా.

– ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంఈఓ

మళ్లీ ముంపు భయం

- ఏటా వర్షాకాలంలో మునుగుతున్న కాలనీ
- ముంపునకు గురవుతున్న పొలాలు
- ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూపులు



జలమయమైన చర్లఅంకిరెడ్డిపల్లి ఎస్సీ కాలనీ (ఫైల్)

చిన్నకోడూరు(సిద్దిపేట): ఏటా వర్షాకాలంలో కాలనీతో పాటు పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. గోదావరి సుజల స్రవంతి తాగునీటి పంప్ హౌస్‌లోని వేస్టేజ్ వాటర్ సాగు భూమిని ముంపునకు గురి చేస్తోంది. పుడమి తల్లిని నమ్ముకున్న రైతన్నలకు సమస్యగా మారింది. కోహెడ మండలం శనిగరం వద్ద వందేళ్ల క్రితం ఒక టీఎంసీ సామర్థ్యంతో మధ్యతరహా ప్రాజెక్టు నిర్మించారు. వానాకాలంలో వర్షాలు బాగా కురిస్తే ప్రాజెక్టు నిండి చర్లఅంకిరెడ్డిపల్లి ఎస్సీ కాలనీతో పాటు పంట పొలాలు ముంపునకు గురవుతాయి. అంతే కాకుండా గ్రామ శివారులో నిర్మించిన హెచ్ఎండీఏ వాటర్ పంప్ హౌజ్‌లోని వేస్టేజ్ వాటర్ చెరువులోకి భారీగా చేరుతుంది. దీంతో ప్రాజెక్టు బ్యాక్ వాటర్ సమస్యతో ఏటా పంట పొలాలు నీట మునుగుతున్నాయి. వానాకాలంలో పంటలు వేయలేని పరిస్థితి నెలకొంది. గ్రామంలోని ఎస్సీ కాలనీలో సుమారు 25 కుటుంబాలు ఉన్నాయి. వర్షం కురిస్తే ఇళ్లలోకి నీరు రావడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బాధితులకు ప్రత్యామ్నాయ మార్గాలు కానీ, పరిహారం చెల్లింపుపై కానీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఎస్సీ కాలనీ వాసులకు స్థలాలు కేటాయించాలని, మునుగుతున్న పంటలకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని కోరుతున్నారు.

‘నీట్’ అవకతవకలపై విచారణ జరిపించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

హుస్నాబాద్: నీట్ పరీక్ష అవకతవకలపై కేంద్ర ప్రభుత్వం విచారణ జరిపించి విద్యార్థులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో యువజన విభాగం నాయకులు అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. నీట్ పరీక్ష రాసిన విద్యార్థులు తమకు న్యాయం చేయాలని నిరసన తెలిపినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పరీక్ష పేపర్లు లీకేజీ జరగకుండా చూసే బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి విచారణ జరిపించాలన్నారు. కార్యక్రమంలో యువజన నాయకులు అయిలేని మల్లికార్జున్ రెడ్డి, చిరంజీవి, సతీష్, భాస్కర్, జీవన్, లక్ష్మణ్, సునీత, లక్ష్మి, పద్మ తదితరులు ఉన్నారు.

రైతు రుణమాఫీ చారిత్రాత్మక ఘట్టం

- టీ పీసీసీ సభ్యుడు లింగమూర్తి



సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హుస్నాబాద్: తెలంగాణ రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీపై క్యాబినెట్ ఆమోదం తెలపడం చారిత్రాత్మక ఘట్టమని టీ పీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి అన్నారు. రుణమాఫీ ప్రకటనపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా లింగమూర్తి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తానని అధికారంలోకి వచ్చి రుణమాఫీ చేయకుండా మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15లోగా రూ.2 లక్షల రుణమాఫీ చేసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం విధివిధాలను రూపొందించినందుకు సీఎం, మంత్రి వర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందనడానికి రైతురుణ మాఫీ ప్రకటనే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందు, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిత్తారి రవీందర్, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు, భూక్య సరోజన, పున్న లావణ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ చౌరస్తా వద్ద ..

కోహెడ(హుస్నాబాద్): రూ.2 లక్షల రుణమాఫీ ప్రకటనపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. రైతుల సంక్షేమానికి సీఎం ప్రాధాన్యత ఇస్తున్నారని నాయకులు కొనియాడారు.

ఎన్నికల సమయంలో..

అక్కన్నపేట(హుస్నాబాద్): ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ ప్రకటనపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో అక్కన్నపేట గ్రామ మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి, గుడాటిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ బద్దం రాజిరెడి పాల్గొన్నారు.

గట్లమల్యాలలో..

నంగునూరు(సిద్దిపేట): రైతు రుణమాఫీకి మంత్రి వర్గం ఆమోదం తెలపడంపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం గట్లమల్యాలలో రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు తిప్పని రమేశ్, రవీంద్రాచారి, పార్టీ ఉపాధ్యక్షుడు గాడ్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



వినతి పత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వేల్పుల ప్రసన్నకుమార్ అన్నారు. ఈ మేరకు మండల విద్యాధికారి కార్యాలయంలో ఎంఈఓ యాదవరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు చట్ల సమ్మయ్య, బానోత్ నవీన్, సిద్దుల సుమన్ పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, బీజేఆర్ చౌరస్తాతో పాటు పలు ప్రాంతాల్లో తమ సిబ్బందితో కలిసి వారం క్రితం వాహనాల తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో 25 మంది వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని శనివారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.14,100 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

బైక్ చోరీ

దుబ్బాక: గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌ను చోరీ చేశారు. ఈ సంఘటన దుబ్బాకలో జరిగింది. ఎస్ఐ గంగరాజు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం అంతారం గ్రామానికి చెందిన సింగితం వీరన్న శుక్రవారం చీకోడ్ శివారులో ఉన్న ఆశ్రమం వద్ద బాబా గుడికి ఏపీ 28 బీఎం 2993 బైక్‌పై వచ్చాడు. ఆశ్రమం వద్ద బైక్‌ను పార్క్ చేసి దర్శనం చేసుకొని వచ్చి చూడగా అతడికి బైక్ కనబడలేదు. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నాచగిరిలో భక్తుల సందడి

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం నాచగిరి పుణ్యక్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు శ్రీలక్ష్మీనృసింహస్వామివారిని దర్శించుకున్నారు. వ్రతాలు, కల్యాణం, అభిషేకాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

హిందూ వాహిని కమిటీ నియామకం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): హిందూ వాహిని సిద్దిపేట జిల్లా నూతన కమిటీని శనివారం నియమించారు. తెలంగాణ రాష్ట్ర హిందు వాహిని సంఘటక్ యాది రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడిగా బస్వరాజు సత్యం, ప్రధాన కార్యదర్శులుగా బండి కిరణ్ కుమార్, పన్యాల మహేందర్ రెడ్డి, పూదరి వెంకటేష్ నియమితులయ్యారు. వీరితో పాటు వివిధ శాఖలకు ప్రముఖులు, సహ ప్రముఖులను నియమించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల శివాజీ, రాష్ట్ర బోధన సహప్రముఖ్ చల్ల బాల్ రెడ్డి, రాష్ట్ర సంపర్క సహ ప్రముఖ్ కస్తూరి భూమి రెడ్డి, రాష్ట్ర కార్యాలయ సహ ప్రముఖ్ ఆకుల ప్రశాంత్ పాల్గొన్నారు.



జిల్లా హిందూవాహిని నూతన కార్యవర్గం

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- మంత్రి కొండా సురేఖ

దుబ్బాక: దుబ్బాక నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో మంత్రిని కలిసి పలు ఆలయాల అభివృద్ధితో పాటు దుబ్బాక మున్సిపల్ పెండింగ్ నిధులు, నియోజకవర్గంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల కార్యక్రమాలపై చర్చించారు. మంత్రి సానుకూలంగా స్పందించి ఆలయాల అభివృద్ధి, దుబ్బాక మున్సిపాల్టీ అభివృద్ధి నిధుల మంజూరుకు హామీ ఇచ్చారన్నారు.



మంత్రి కొండా సురేఖను కలిసిన చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

కాంగ్రెస్ ప్రభుత్వ తీరు బాధాకరం

బీఆర్ఎస్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు యాదగిరి

సిద్దిపేటజోన్: విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరి బాధాకరమని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ప్రతినిధులు అన్నారు. శనివారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు యాదగిరి మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమైనా విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ చేయలేదన్నారు. గత ప్రభుత్వం గురుకుల విద్యార్థులకు సకాలంలో వసతులు కల్పించిందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే బాలికలను మోటార్ వాహనాలు పంపిణీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

దొంగల ముఠా అరెస్ట్

హుస్నాబాద్: దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు శనివారం రాత్రి ఎస్ఐ మహేష్ తెలిపారు. ఏపీకి చెందిన ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంకు చెందిన ఇట్ట ఆంజనేయులు, దేవర కొండ దుర్గారావు, ఖమ్మం జిల్లా మధిరకు చెందిన శ్రీరామ్‌గోపీ, భూపాలపల్లికి చెందిన రేవెల్లి రమేష్, మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన కంపనాని రెండు రోజుల క్రితం హుస్నాబాద్ లో జరిగిన ర్యాలీల్లో దొంగతనాలు చేస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి షిఫ్ట్ డిజైర్ కారు, ఐదు మొబైల్ ఫోన్లు, రూ.6 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులకు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు.

కేంద్ర మంత్రికి సన్మానం

చిన్నకోడూరు(సిద్దిపేట): కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌ను శనివారం బీజేపీ సోషల్ మీడియా సిద్దిపేట జిల్లా కన్వీనర్ ముచ్చర్ల నాగరాజు ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని ఆయన నివాసంలో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కష్టపడి పని చేయాలన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేసినట్లు తెలిపారు.

మంత్రికి శుభాకాంక్షలు

బెజ్జంకి(సిద్దిపేట): కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్‌ను శనివారం కరీంనగర్‌లో మండలంలోని బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పూలగుచ్ఛంతోపాటు నోట్‌బుక్స్ ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

కేశనాయక్‌తండా గ్రామ మాజీ సర్పంచ్..



బండి సంజయ్‌ను సన్మానిస్తున్న నాయకులు

అక్కన్నపేట(హుస్నాబాద్): కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను శనివారం కరీంనగర్‌లోని ఆయన నివాసంలో మండలంలోని కేశనాయక్‌తండా గ్రామ మాజీ సర్పంచ్ భానోతు రవీందర్, పార్టీ మాజీ అధ్యక్షుడు గొల్లపల్లి వీరాచారి తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. అక్కన్నపేట మండల అభివృద్ధికి ప్రత్యేక నిధులను కేటాయించాలని కోరినట్లు మాజీ సర్పంచ్ తెలిపారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

గజ్వేల్‌రూరల్: అగ్ని ప్రమాదాలు జరిగినపుడు అప్రమత్తంగా ఉండాలని గజ్వేల్ ఫైర్ స్టేషన్ అధికారి కుమార్, లీడింగ్ ఫైర్‌మెన్ చంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోగల సెయింట్ మేరీస్ విద్యానికేతన్‌లో విద్యార్థులకు అగ్ని ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది సతీష్, సిద్దిరాములు, నాగరాజు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఇసుక డంపులు సీజ్

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డిలో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను రెవెన్యూ, పోలీస్ అధికారులు శనివారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గోవర్ధన్ మాట్లాడుతూ సీజ్ చేసిన ఇసుక డంపులను ఈనెల 25వ తేదీ ఉదయం 11 గంటలకు వేలం వేస్తామన్నారు. మండల పరిధిలో ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

◆ పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి 6వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకుడు కనగండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికులకు వైద్య పరీక్షలు చేసి మాస్కులు, ఉచితంగా మందులు అందజేశామన్నారు. కార్యక్రమంలో డాక్టర సీహెచ్ దయాకర్, నాయకులు పాల్గొన్నారు.

◆ కుక్కల బెడదతో గగ్గోలు

నంగునూరు(సిద్దిపేట): కుక్కల దాడులతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. శనివారం మండలంలోని దర్గపల్లి గ్రామస్తులు విలేకరులతో మాట్లాడుతూ మూకుమ్మడిగా కుక్కలు దాడి చేయడంతో ఇప్పటి వరకు 35 లేగ దూడలు మృత్యువాతపడగా, పలువురు గాయపడ్డారన్నారు. గ్రామంలో కుక్కల సంచారంతో చిన్నపిల్లలు తిరగలేని పరిస్థితి నెలకొందని, అధికారుల స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

◆ సొంత భవనాలు నిర్మించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వ వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలని బహుజన ప్రజాస్వామ్య సమైక్య, తెలంగాణ రాష్ట్ర హక్కుల పోరాట సమితి విద్యార్థి, యువత విభాగం, తెలంగాణ ముదిరాజ్ హక్కుల పోరాట సమితి నాయకులు అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

◆ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

దుబ్బాకటౌన్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దౌల్తాబాద్ ఎస్ఐ ప్రేమ్‌దీప్ అన్నారు. శనివారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో సైబర్ నేరాలు, వాహన నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ నేరస్తులు ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. అపరిచితులకు వ్యక్తిగత వివరాలు చెప్పొదన్నారు.

◆ డబుల్ బెడ్‌రూం ఇళ్లను అమ్ముకున్నారు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నిరుపేదలకు అందాల్సిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఇతరులకు అమ్ముకున్నారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఆరోపించారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్‌లో భారీ అవినీతి జరిగిందన్నారు. సిద్దిపేట మున్సిపల్ చైర్ పర్సన్‌పై త్వరలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ అవినీతి సహించలేక ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు.

◆ విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేత

చేర్యాల(సిద్దిపేట): పెద్దమ్మగడ్డ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు గణిత ఉపాధ్యాయుడు రాకేష్‌రెడ్డి తన సొంత ఖర్చుతో నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. శనివారం పాఠశాల ఆవరణలో హెచ్ఎం గుడ్ల బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం నాగమణి చేతుల మీదుగా అందజేశారు.

◆ ప్రజా రక్షణే బాధ్యతగా విధులు

దుబ్బాక: ప్రజల రక్షణ కోసం పోలీసులు బాధ్యతగా విధులు నిర్వర్తిస్తారని దుబ్బాక సీఐ శ్రీనివాస్ అన్నారు. శనివారం దుబ్బాక ఏఎస్ఐ వహీద్ పాషా బదిలీపై కరీంనగర్‌కు వెళ్తుండటంతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎస్ఐ విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేశారన్నారు.

◆ దరఖాస్తు చేసుకోండి

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపల్ పరిధి లచ్చపేట ఆదర్శ పాఠశాలలో 6వ తరగతికి నిర్వహించిన ప్రవేశ పరీక్షకు సంబంధించిన ఫలితాలను పాఠశాలలో నోటీస్ బోర్డ్‌లో ఉంచినట్లు ప్రిన్సిపాల్ సుప్రియ శనివారం తెలిపారు. ప్రవేశ పరీక్షలో ఎంపికైన విద్యార్థులు సర్టిఫికెట్లు అందజేసి ప్రవేశం పొందాలని పేర్కొన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూప్‌లలో సీట్లు ఉన్నాయన్నారు.

◆ సద్వినియోగం చేసుకోవాలి

బెజ్జంకి(సిద్దిపేట): 25వ తేదీన మానకొండూర్ నియోజకవర్గం తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలో నిర్వహించనున్న మెగాజాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ శనివారం కోరారు. వివరాలకు 72889 21431, 90300 47304 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.